ప్రజాశక్తి
శనివారం 8 నవంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పంట నష్టం అంచనాకు
10న కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాల సందర్శన, నష్టాల అంచనాపై కేంద్ర కమిటీ బాపట్ల వస్తోందని, ఇందు కోసం రూట్ మ్యాప్ తయారు చేయాలని రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. శుక్రవారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో జూమ్ సమావేశం నిర్వహించారు. బాపట్ల నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల కురిసిన మొంథా తుఫాను కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ పంటలు, ఉద్యానవన పంటలు, రోడ్లు, బ్రిడ్జిలను సందర్శించి నష్టాల అంచనా వేయటానికి ఈ నెల 10న కేంద్ర కమిటీ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న వ్యవసాయ పంటలు, ఉద్యానవన పంటలు, రోడ్లు, బ్రిడ్జిలకు సంబంధించి ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని, కేంద్ర బృందం పర్యటనకు రూట్ మ్యాప్ తయారుచేయాలన్నారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాపట్ల, ప్రకాశం జిల్లాలలో దెబ్బతిన్న వ్యవసాయ పంటలు, ఉద్యానవన పంటలు, రోడ్లు, బ్రిడ్జిలకు సంబంధించి ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బాపట్ల జిల్లాకు సంబంధించి చీరాల బీచ్ రోడ్ లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు, ఇళ్ళు, చీరాల, చినగంజాంలో దెబ్బతిన్న వరి పొలాల సందర్శనకు రూట్ మ్యాప్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, బాపట్ల,చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, చంద్రశేఖర్ మరియు అన్ని మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

'గ్రీన్ ఒంగోలు'ను ప్రారంభించిన ఇన్‌ఛార్జి మంత్రి ఆనం 5లో

'ప్రకాశం' సమగ్రాభివృద్ధికి
సమన్వయంతో పనిచేయండి

- తాగునీటి సమస్యలు పరిష్కరించండి
- వైద్య సేవలపై సమగ్ర ప్రణాళికలు
- దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు చర్యలు
- అధికారులకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం ఆదేశం



డిఆర్‌సిలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమగ్రమైన ప్రణాళికలతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష మండలి సమావేశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ, మైక్రో ఇరిగేషన్, పశు సంవర్ధక శాఖ, మార్కెటింగ్, అటవీ శాఖ, జాతీయ రహదారులు వంటి అంశాలపై క్షుణ్ణంగా సమీక్షించారు. ఆయా కార్యక్రమాల అమలులో నెలకొని వున్న సమస్యల పరిష్కారానికి ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రధానంగా జిల్లాలో తాగునీటి సమస్య ఎలా ఉంది, తుపాన్ కారణంగా అనేక ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఏర్పడటం, మంచినీటి సరఫరా పథకాలల్లో ఇబ్బందులు కలగడం, హ్యాండ్ బోర్ల మరమ్మతులకు గురికావడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి ఆదేశాలతో వీటన్నిటినీ పరిష్కరించే దిశగా కలెక్టర్ చర్యలు చేపట్టారన్నారు. మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి కొన్ని అంశాలను శాసన సభ్యులు ప్రస్తావించగా, ఆసుపత్రులకు వెళ్లి వాటి ▶ 3లో

మొక్కుబడిగా డిఆర్‌సి 8లో

కార్మిక ఉద్యమం బలోపేతం దిశగా..

- జిల్లాలో సిఐటియు అడుగులు
- నేడు దర్శిలో జిల్లా మహాసభలు
- ఉద్యమ దిశపై మేధోమధనం



దర్శిలో సిఐటియు జిల్లా మహాసభల సందర్భంగా ఏర్పాటుచేసిన జెండాలు, తోరణాలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు కార్మిక వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రైవేటీకరణ వేగంగా సాగుతుండగా, ఉద్యోగ భద్రత క్షీణిస్తోంది. వేతనాల పెంపు, రెగ్యులరైజేషన్, చట్టబద్ధ హక్కుల సాధన వంటి ప్రాథమిక డిమాండ్లకే ఉద్యోగులు, కార్మికులు దీర్ఘకాల పోరాటాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సిఐటియు అన్ని రంగాల కార్మిక సమస్యలను సమీక్షిస్తూ, ఉద్యమాన్ని బలోపేతం చేసే దిశగా ప్రణాళికను రూపొందించి నేడు, రేపు దర్శిలో జరగనున్న మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి నాయకత్వ శ్రేణులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

కార్మికవర్గ స్థితిగతులు..

ప్రైవేటీకరణ కారణంగా సంఘటిత రంగాల్లో యూనియన్లు బలహీనమవుతున్నాయి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లలో అస్థిరత, వేతన అసమానతలు కొనసాగుతున్నాయి. మున్సిపల్, అంగన్వాడీ, ఆశా, స్వచ్ఛభారత్ కార్మికుల్లో హామీలు నెరవేరకపోవడంతో అసంతృప్తి పెరుగుతోంది. వీధివ్యాపారులు, భవననిర్మాణ, ఆటో, హమాలీ, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రంగాల్లోనూ స్థానిక సమస్యలపై కదలికలు విస్తరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అసంఘటిత కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు..

జి.ఓ నెం.1కు వ్యతిరేకంగా భోగిమంటల్లో నిరసనలు, లేబర్ కోడ్ల రద్దు డిమాండ్‌పై జరిగిన నిరసనలు, విద్యుత్, స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ఆందోళనలు, కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యుత్ బిల్లుకు వ్యతిరేక కదలికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేక ఐక్య ఉద్యమాలు జిల్లాలో సిఐటియు ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో నిర్వహించారు. అఖిల భారత డిమాండ్లతో 2024, 2025 సంవత్సరాల్లో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లోజిల్లా వ్యాప్తంగా వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

రంగాల వారీగా సాధించిన విజయాలు..

అంగన్వాడీ రంగం: 43 రోజుల చారిత్రాత్మక సమ్మెతో టీచర్లకు ప్రమోషన్, రిటైర్మెంట్ వయస్సు పెంపు, గ్రాట్యూటీ, సెలవులు వంటి పలు విజయాలు సాధించుకున్నారు. జిల్లా లోని అన్ని ప్రాజెక్టుల్లో సంఘం మిలిటెంట్ ఉద్యమం చేపట్టడం విశేషం. జిల్లాలో అంగన్వాడీలు పనిచేయని సెల్ ఫోన్లు ప్రాజెక్టు కార్యాలయంలో అందజేసిన ఉద్యమం రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తినిచ్చింది.

ఆశా రంగం: జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఆశాల ప్రాతినిధ్యం తో ఉద్యమం పటిష్ఠంగా ఉంది. ఉద్యమ ఫలితంగా ప్రమాదభీమా, మేటర్నిటీ లీవ్, వయోపరిమితి పెంపు వంటి ముఖ్యమైన సమస్యలను పరిష్కరించుకున్నారు.

మున్సిపల్ రంగం: జిల్లా కేంద్రం తో పాటు అన్ని మున్సిపల్ కేంద్రాల్లో ▶ 3లో



అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నిమ్మల రామానాయుడు

యుద్ధ ప్రాతిపదికన 'వెలిగొండ' పనులు

- ఆయకట్టుకు 2026లో నీరందిస్తాం..
- ప్రాజెక్టు సందర్శనలో మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

'పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' పనులు పూర్తి చేయడంతో పాటు 2026లో ఆయకట్టుకు నీరందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను నిపుణుల బందంతో శుక్రవారం ఆయన పరిశీలించారు.

మొంథా తుపాను కారణగా అధిక వర్షాలకు ఫీడర్ కెనాల్ 850 మీటర్ వద్ద సుమారు వంద అడుగుల పొడవున 30 అడుగుల లోతులో పడిన గండిని పరిశీలించారు. జంట సొరంగాలలోకి 9 కి.మీ మేర చొచ్చుకు వచ్చిన వరద నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కూడా వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సి.సి వాల్ లైనింగ్ నిర్మాణంలో డిజైన్ అప్రూవల్ చేయాలని అధికారులకు సూచించారు.

అనంతరం వెలిగొండ క్యాంప్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్ట్ పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 30 ఏళ్ల క్రితం ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ పూర్తి కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెలిగొండకు ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తున్నామని ▶ 3లో

వర్షపు నీటిలోనే సొరంగ మార్గాలు



సొరంగమార్గంలో వర్షపు నీరు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మొంథా తుపాను ప్రభావంతో వెలిగొండ ప్రాజెక్టు సొరంగ మార్గాలు రెండూ పూర్తిగా మునిగిపోయాయి. దాదాపుగా పది కిలోమీటర్ల మేర మార్గాలలోకి నీరు వెళ్లింది. సొరంగ మార్గం దాదాపుగా మునిగిపోయింది. గత వారం రోజులుగా పది పెద్ద మోటర్ల ద్వారా నీటిని బయటికి పంపిస్తున్నారు. ఈ విధంగా పంపిస్తే ఇంకా 20 రోజుల వరకు పట్టవచ్చునని సమాచారం. ఆ తరువాత మట్టి పూడికలతోపాటు సామాను శుభ్రపరిచేసరికి మరో 10 రోజులు పట్టొచ్చని అంటున్నారు. లైనింగ్ పనులతోపాటు సొరంగం లోపలి పనులు మొదలు కావాలంటే నెల తర్వాతనేనని అధికారులు నిర్ధారణకు వస్తున్నారు. ఈ లెక్కన 2026లో నీళ్లు ఇవ్వడం అసాధ్యమని చర్చించుకుంటున్నారు. రెండు సొరంగ మార్గాలు నీటిలో మునిగిపోయినా అధికారులు, మంత్రులు నీళ్లు ఇస్తామని చెబుతున్నారు. ఏమి జరుగనుందో వేచి చూడాల్సిందే.

ప్రకటన

నా పేరు 'కొత్త వెంకట జయమురళి కృష్ణ', తండ్రి: కె.వి.అయ్యప్పశెట్టి (కిరాణాషాపు). మాది ప్రకాశం జిల్లా గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన అర్ధవీడు గ్రామం. నేను ముంబై నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాను. నేను అక్టోబర్ నెల 20-10-2025న నావ్యక్తిగత పని మీద అర్ధవీడు గ్రామం నుండి బైక్ పైప్రయాణం చేసి నాగులవరం వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో బైక్ ట్యాంక్ కవర్‌లో ఉన్న పర్సు జారిపడింది. రాత్రి సమయం అయినందున గుర్తించలేక పోయాను. దానిలో నాయొక్క ఆధార్ కార్డు, పాసుపోర్టు బుక్ వున్నది. మరుసటి రోజు ఉదయాన్నే బండి మీద చూసుకుంటూ వెళ్ళినాను. నాకు ఎక్కడా కనిపించ లేదు. ఎవరికైనా కనిపిస్తే క్రింద తెలిపిన ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి అందజేయావాలినదిగా నా మనవి.

ఇట్లు
కొత్త వెంకట జయమురళీకృష్ణ,
అర్ధవీడు
ఫోన్ నెంబర్: 8106703323, 9492318425.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.ఎస్. 327/2024

యక్కలి పూర్ణచంద్రరావు .... వాది

వర్సెస్

ఉబ్బరపు శివయ్య ..... ప్రతివాది

టు,
ఉబ్బరపు శివయ్య, తండ్రి: రామయ్య,
నివాసం: చెన్నరాయునిపల్లె గ్రామం,
యర్రగొండపాలెం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను వాది, ప్రతివాదిపై ప్రామిసరి నోటు బాకీ రాబట్టు నిమిత్తం పై కోర్టులో దావా వేయగా ఎన్ని పర్యాయములు దావా సమనులు జారీ చేసిననూ ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున తేదీ: 24-11-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 24-11-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.ఎస్. 426/2022

ఊటుకూరి శ్రీనివాసరావు .... వాది

వర్సెస్

డుమావత్ క్రిష్ణ నాయక్ ...... ప్రతివాది

టు,
డుమావత్ క్రిష్ణ నాయక్, తండ్రి: లక్ష్మినాయక్
నివాసం: బోడెనాయక్ తండా,
పెద్దదోర్నాల మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను వాది, ప్రతివాదిపై ప్రామిసరి నోటు బాకీ రాబట్టు నిమిత్తం పై కోర్టులో దావా వేయగా ఎన్ని పర్యాయములు దావా సమనులు జారీ చేసిననూ ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున తేదీ: 17-11-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 17-11-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.ఎస్. 582/2024

ఊటుకూరి శ్రీనివాసరావు ..... వాది

వర్సెస్

దర్శనం యేసేబు ...... ప్రతివాది

టు,
దర్శనం యేసేబు, తండ్రి: దేవదానం,
నివాసం: ఐనముక్కుల గ్రామం,
పెద్దదోర్నాల మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాను వాది, ప్రతివాదిపై ప్రామిసరి నోటు బాకీ రాబట్టు నిమిత్తం పై కోర్టులో దావా వేయగా ఎన్ని పర్యాయములు దావా సమనులు జారీ చేసిననూ ముట్టని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున తేదీ: 17-11-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 17-11-2025

ఇ.శారద,
అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ ఒంగోలు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S. NO.103/2023

మధ్యలో :
వడ్రాణం ఛాయాదేవి ....అప్పిలెంట్
మరియు
వడ్రాణం శ్రీరామమూర్తి, వగైరా ...రెస్పాండెంట్స్

To

R2) కరణం అమ్మయ్య చౌదరి,
తండ్రి మల్లేశ్వరరావు,
నివాసం - తిమ్మసముద్రం గ్రామం,
నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా.

పై నంబరు అప్పీలు దావాలో 2వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా అప్పీలు నోటీసులు పంపిననూ,వాటిని తీసుకొన నందున, కోర్టువారు మీకు అప్పీలు నోటీసులు జారీచేయు నిమిత్తము తేది:10-11-2025న వాయిదా వేసి సదరు వాయిదాను ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా రోజున ఉదయం గం.10:30 ని.లకు మీరు స్వయముగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ, పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనగలరు. లేని యెడల కోర్టువారు మీకు పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేది : 10-11-2025.

ఇట్లు
నన్నెబోయిన ఆంజనేయులు, M.A., LL.B.,
అప్పిలెంట్ తరపున న్యాయవాది ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

ప్రజాశక్తి
శనివారం 8 నవంబర్ 2025

'ప్రకాశం' సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి..

(మొదటిపేజీ తరువాయి)

పనితీరు, వైద్య సేవల అమలు తీరు పరిశీలన చేసి సమగ్రంగా నివేదిక ఇవ్వాలని వైద్యాధికారులను ఆదేశించామన్నారు. మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అనేక జాతీయ రహదారులు దెబ్బతిన్నాయని, సంబంధిత అధికారులతో పూర్తి స్థాయిలో సమీక్షించామన్నారు. వాటిని త్వరగా పునరుద్ధరణ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ప్రకాశం జిల్లాలో ఎక్కువ ఆలయాలు అటవీ శాఖ పరిధిలో ఉండటంతో వాటిలో మౌలిక సదుపాయాలు, వాటి అభివద్ధి కి కొంత ఇబ్బంది పరిస్థితి ఉండేదని, ఈ సమస్యను ముఖ్యమంత్రి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దష్టికి తీసుకువెళ్ళి, అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించామన్నారు. అటవీ శాఖ పరిధిలో ఉన్న ఆలయాల అభివద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. జాతీయ రహదారుల అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయని, ఈ అంశాలపై మరొకసారి సంబంధిత అధికారులతో సమీక్షించాలని సూచించామన్నారు. త్వరలోనే మరోసారి సమావేశం ఏర్పాటుచేసి వ్యవసాయ, సంక్షేమ కార్యక్రమాలపై పూర్తి వివరాలపై అధికారులతో చర్చించామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అధికారులు సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులుగా పనిచేస్తామని ఇన్‌చార్జి మంత్రి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లాను అన్ని రంగాల్లో అభివద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను, సమస్యలను పరిష్కారించే దిశగా కషి చేస్తామని మంత్రి తెలిపారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ, ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ, జిల్లాలో శాంతి భద్రతకు చేపడుతున్న చర్యలు, జిల్లాలో గంజాయిని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం, సంతనూతలపాడు, శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావు, కందుల నారాయణరెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, బిఎన్ విజయ కుమార్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఎపి మార్కిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర పర్యాటకాభివద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-దర్శి

సిఐటియు ప్రకాశం జిల్లా 13వ మహాసభలకు నాయకులు సర్వం సిద్ధం చేశారు. నేడు జరిగే కార్మికుల ప్రదర్శన బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గడియార స్తంభం సెంటర్లో సిఐటియు తోరణాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పిజియన్ కాంప్లెక్స్ కల్యాణ మండపం వద్ద జరిగే సభా వేదిక వద్ద కూడా తోరణాలు ఏర్పాటు చేశారు. రోడ్డుపై, డివైడర్స్‌పై తోరణాలు జెండాలు ఏర్పాటు చేశారు. పొదిలి, కురిచేడు, అద్దంకి, చౌటపాలెం రోడ్డుల్లో తోరణాలు ఫ్లెక్సీలు, పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఉదయం ఆర్ అండ్ బి బంగ్లా వద్ద చవటపాలెం రోడ్‌లో బహిరంగ సభ 11 గంటలకు జరుగుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి తాండవ రంగారావు తెలిపారు. ఈ ప్రదర్శన బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి సిఐటియు ఆధ్వర్యంలో అన్ని రంగాల కార్మిక సంఘాలు రానున్న సందర్భంగా వారికి కావలసిన ఏర్పాట్లన్నీ సిఐటియు నాయకులు సిద్ధం చేశారు.



సిఐటియు జెండాలతో అలంకరించిన సభా వేదిక

కార్మిక ఉద్యమం బలోపేతం దిశగా..

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమం పటిష్టంగా ఉంది. జిల్లా కేంద్రంలో కార్మికుల సమస్యలపై నిరంతరం ఉద్యమం నడుస్తుంది. ఈ కాలంలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతన పెంపు, హెల్త్ అలవెన్సు, ఎక్స్‌గ్రేషియా, బెనిఫిట్స్ పెరిగాయి.

సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు: కాంట్రాక్టు ఉద్యోగులు ఉద్యమం ఫలితంగా 23 శాతం వేతన పెంపు సాధించారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు: పిఆర్‌సి సవరణలతో అరియర్స్ సాధించుకున్నారు.

జిల్లా స్థాయిలో పోరాటాలు...

భవననిర్మాణం, ఆటో, ముఠా, హమాలీ రంగాల్లో సర్వేలు చేసి సమస్యలపై నిరసనలు, ధర్నాలు జరిగాయి. కనిగిరి, మార్కాపురం, పొదిలి, గిద్దలూరు, ఒంగోలు పట్టణాల్లో వీధివ్యాపారుల తొలగింపుకు వ్యతిరేకంగా దశలవారీ ఉద్యమాలు నడిచాయి.

చీమకుర్తి గ్రానైట్ రంగంలో పెండింగ్ వేతనాలు, ప్రమాద పరిహారం సాధించారు. టంగుటూరు టోల్ ప్లాజా కార్మికుల 43 రోజుల సమ్మెతో దీర్ఘకాల పెండింగ్ సమస్యలు పరిష్కారం అయ్యాయి. గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ వేతనాలు సాధించుకునేలా 21 మండలాల్లో జోక్యాలు జరిగాయి. తొలగింపులపై పోరాడి కొంతమందిని తిరిగి విధుల్లోకి తీసుకురావడంలో విజయవంతమయ్యారు.

నివాసప్రాంత కృషి..

సంఘాల నేతృత్వంలో సామాజిక సంబంధాలు బలోపేతం కోసం సంక్రాంతి క్రీడలు, రక్తదాన శిబిరాలు, మేడే సేవా కార్యక్రమాలు వంటి సామాజిక చర్యలతో సిఐటియు ప్రజల్లో సాన్నిహిత్యం పెంచుకుంది. సాంస్కతిక రంగంలో కొంత వెనుకబాటు ఉన్నా, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు విస్తరిస్తున్నాయి.

కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలి

కాలం సుబ్బారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు..



ప్రకాశం జిల్లాలో ప్రధాన పరిశ్రమలైన గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలు ప్రభుత్వ విధానాల ప్రభావంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ఎగుమతులు తగ్గడంతో అనేక ఫ్యాక్టరీలు మూతపడి, క్వారీలు నత్తనడకన నడుస్తున్నాయి. కార్మికులు పనులు కోల్పోయి స్వగ్రామాలకు వెళ్తున్నారు. వేతనాలు తగ్గించడం, భద్రతా చర్యలు లేమి, తనిఖీల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు పెరుగుతున్నాయి. యజమానులు చట్టాలను ఉల్లంఘిస్తూ కార్మికులను దోపిడీ చేస్తున్నారు. గ్రానైట్ పరిశ్రమను కాపాడి, కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలి

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఎం రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి



ఈ నెల 8, 9 తేదీలలో దర్శి లో జరిగే సిఐటియు13వ జిల్లా మహాసభల జయప్రదం చేయడానికి ఉద్యోగ, కార్మిక, కర్షక సంఘాలు తమ వంతు సహకారం అందిస్తున్నాయి. నవంబర్ 8న ప్రారంభ సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్. నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శులు కారుసాల సుబ్బరావమ్మ, కె ఉమామహేశ్వరరావు ప్రధాన వక్తలుగా పాల్గొంటారు. 9న ప్రతినిధుల సభలో సిఐటియు ఉద్యమ కషిని సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారు.

మొక్కజొన్న తోటలో మృతదేహం కలకలం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని చిలకచర్లలో మొక్కజొన్న తోటలో పదహారేళ్ల యువకుడి మృతదేహం కలకలం రేపింది. గ్రామంలోని మొక్కజొన్న తోటలో పూడ్చిపెట్టిన శవం ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ మహేష్ చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీయించి ఒంగోలు నుంచి వచ్చిన డాక్టర్‌చేత రెవెన్యూ అధికారుల సమక్షంలోనే సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. నందిగూడేనికి చెందిన అర్తి నాగులు అనే గిరిజన యువకుడు గత రెండు వారాలుగా కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని తమ కుమారుడిగా గుర్తించారు. చేతికొచ్చిన కొడుకు మొక్కజొన్న తోటలో ఇలా శవమై తేలడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఆ యువకుడు ఎలా చనిపోయాడనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని దోర్నాల ఎస్ఐ మహేష్ తెలిపారు. మృతదేహాన్ని తోటలో పూడ్చిపెట్టడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యుద్ధ ప్రాతిపదికన 'వెలిగొండ' పనులు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. రాత్రింబవళ్లు శ్రమించి వెలిగొండ పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా గత వైసిపి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. వైసిపి అనుకూల మీడియాలో వెలిగొండపై అవాకులు చవాకులు పేల్చడం ఆశ్చర్యం గొలుపుతోందన్నారు. ఏడాదిన్నరగా ప్రాజెక్టు పనులు కుంటుపడ్డాయని విమర్శలు చేయడం విడ్డూరం కాక మరేమిటి అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా, ఫ్లోరైడ్ బాధిత జిల్లా ఏదైనా ఉందంటే అది ప్రకాశం జిల్లా మాత్రమే అన్నారు. ఇక్కడి ప్రజలను జగన్ మోసం చేసినట్లు చెప్పారు. తల్లిని, చెల్లిని మోసం చేసిన జగన్‌కు ప్రజలను మోసం చేయడం ఓ లెక్క కాదన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.900 కోట్లకు పైగా పరిహారం అందించాల్సి ఉందన్నారు. వైసిపి ఐదేళ్ల హయాంలో ఒక్కరూపాయి అందించలేదని దుయ్యబట్టారు. నాడు 2014-19లో టిడిపి ప్రభుత్వం లో చంద్రబాబు రూ.1373 కోట్లు నిధులు కేటాయించి రూ.1319 కోట్లు ఖర్చుచేశారని చెప్పారు.

వెలిగొండలో భాగమైన టన్నెల్-2లో ఇంకా 4.2 కి.మీ లైనింగ్ పనులు, బెంచింగ్ పనులు చేయడంతో పాటు, టిబిఎం మెషిన్ తొలగించాల్సి ఉందన్నారు.

ఫీడర్ కెనాల్ లైనింగ్ నిర్మాణంతో పాటు 3 కి.మీ పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కోసం ఇటీవలే రూ.456 కోట్లుతో టెండర్లు పిలిచామని రామానాయుడు వివరించారు. ఈ నెలలో ఫీడర్ కెనాల్ పనులు మొదలు పెట్టబోతున్నట్లు చెప్పారు. టన్నెల్-2లో టిబిఎం మెషిన్ తొలగించడానికి సాంకేతిక నిపుణుల కమిటీని నియమించామని చెప్పారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2026 నాటికి వెలిగొండ పూర్తి చేసి, ఆయకట్టు రైతులకు నీరందించే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. ఇటీవలే హంద్రీ నీవా కాలువల ద్వారా రాయలసీమకు కష్ణా జలాలను తరలించి చూపించామన్నారు. వెలిగొండకు కూడా 2026 నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి నీరందించటం ఖాయమన్నారు. ఆలోగా నిర్వాసితుల కాలనీలు పూర్తి చేయటం, పరిహారం పంపిణీ తదితర సమస్యలు పరిష్కరిస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం గత హయాంలో ఈ ప్రాజెక్టుకి సంబంధించి ఏడు కాలనీలలో నాలుగు కాలనీలు నిర్మించినట్లు చెప్పారు. ఆ పనులు తాలూకు బిల్లులు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాతే చెల్లించామన్నారు. ఈ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధమైన కషి జరుగుతుందని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. వైఎస్ జగన్ హయాంలో చిల్లిగవ్వ కూడా ఇవ్వని కారణంగా వెలిగొండ నిర్వాసితులకు ఇంకా రూ. 900 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. మంత్రి రామనాయుడు వెంట మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గూడూరి ఏరిక్షన్‌బాబు, జలవనరుల శాఖ అధికారులు, వెలిగొండ ప్రాజెక్టు అధికారులు, టిడిపి మండల అధ్యక్షుడు షేక్ మాబు, టిడిపి నాయకులు యేర్వ మల్లికార్జునరెడ్డి, కొప్పుల సుబ్బారెడ్డి, దొడ్డా శేషాద్రి, చంటి, కాశయ్య, ఈదర మల్లయ్య, తాతిరెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడే యోధులు అగ్నిమాపక సిబ్బంది

- తుపాను సమయంలో వారి సేవలు అభినందనీయం
- మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి- చీరాల

తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడే యోధులు అగ్నిమాపక శాఖ సిబ్బంది అని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. చీరాల పట్టణ మున్సిపల్ కార్యాలయం ఎదుట రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న విపత్తు నిర్వహణ అగ్నిమాపక కేంద్రం భవనానికి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విపత్తు సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మొంథా తుపాను సమయంలో ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లి ప్రజల ప్రాణాలు రక్షించారు. గుండ్లకమ్మ నది వరదల్లో చిక్కుకున్న వారిని సైతం సురక్షితంగా బయటకు తెచ్చినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టాన్ని నివారించడంలో అగ్నిమాపక శాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ తుపాను సమయంలో పగలు రాత్రి అనే తేడా లేకుండా అగ్నిమాపక శాఖ సిబ్బంది పనిచేశారని తెలిపారు. వారి సేవలు ప్రశంసనీయమన్నారు. రూ. రెండు కోట్లతో కొత్త భవన నిర్మాణం సంతోషదాయకమన్నారు. వందేమాతరం గీతం 150 ఏళ్ల సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో గీతాన్ని ఆలపిస్తామని తెలిపారు. బాపట్ల పార్లమెంట్ సభ్యుడు, పానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో బాపట్ల జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. కేంద్రం నుంచి రూ.6,600 కోట్ల నిధులు తెచ్చామన్నారు. అగ్నిమాపక శాఖ సేవలను ప్రభుత్వం గుర్తించింది. వందేమాతర గీతం ఎప్పటికీ మన గర్వకారణం అన్నారు. ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య మాట్లాడుతూ చీరాల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. తుపాను అగ్నిమాపక సిబ్బంది అందించిన సేవలు ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ప్రాంతీయ అధికారి ఎంఎ. జిలాని, ఆర్‌డిఒ చంద్రశేఖర్, డివిజనల్ అధికారి వినయ్ కుమార్, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ సజ్జా హేమలత, చీరాల పురపాలక సంఘం చైర్మన్ ఎం. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

రైతులు ఆందోళన చెందొద్దు : ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు



రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం జరగదన్నారు. కొమ్మమూరు కెనాల్‌పై ప్రతిపాదిత లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై అపోహలు,ఆందోళన అవసరం లేదన్నారు. ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల ప్రయోజనం కోసం పిబి4 అనే పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారన్నారు . ప్రముఖ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ సిఎం పిలుపుతో రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ముందు కొచ్చినట్లు తెలిపారు. రైతులకు మేలు చేకూర్చాలనే ప్రసాద్ ఉద్దేశం మంచి దైనప్పటికీ, ప్రభుత్వానికి సమర్పించిన డిపిఆర్ తప్పుల తడకగా ఉందన్నారు. సాంకేతిక పరంగా లోపాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నాలుగు నెలల క్రితమే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని పక్కన పెట్టిందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని సంబంధించి సాంకేతిక అంశాలపై పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి తానే స్వయంగా నివేదిక అందినట్లు తెలిపారు. కొమ్మమూరు కెనాల్‌పై ప్రతిపాదిత లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టిందని చెప్పారు. రైతులందరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైసిపి ఉచ్చులో రైతులు పడవద్దని విజ్ఞప్తి చేశారు. వైసిపి చేస్తున్న ప్రచారం,అపోహలను నమ్మవద్దన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో కొమ్మమూరు కాలువను నిర్లక్ష్యం చేసిందన్నారు. కనీసం మరమ్మతులు చేపట్టపోవడంతో మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే కాలువలను ఆధునికరించి వాటర్ కెపాసిటీ పెంచి చిట్టచివరి భూములకు సైతం నిరందించేలా కృషి చేసినట్లు తెలిపారు ఏదైనా అనుమానాలు ఉంటే సంబంధిత శాఖ మంత్రి, అధికారులతో నివృత్తి చేసే బాధ్యత తనదేనని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే తెలిపారు.

సోషలిజమే మానవ వికాస మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య

ప్రజాశక్తి- చీరాల

కార్మికుల హక్కులను నిర్వీర్యం చేసేందుకు కార్పొరేట్ శక్తులు ముందుకు వస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా ప్రజలందరూ గళం విప్పి వర్గపోరాటాలు, ప్రజాపోరాటాలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సి.హెచ్. గంగయ్య పిలుపునిచ్చారు. అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా చీరాల గడియారస్థంభం సెంటర్‌లో సిపిఎం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ప్రాంతీయ కార్యదర్శి ఎన్. బాబూరావు అధ్యక్షతన గంగయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం గంగయ్య మాట్లాడుతూ 1917 నవంబర్ 7న రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం ప్రపంచ కష్టజీవుల జీవితాల్లో వెలుగునిచ్చిన చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. రైతులు, కూలీలు, కార్మికులే సమాజాన్ని నడిపిస్తున్నప్పటికీ, ప్రస్తుత వ్యవస్థలో శ్రమ పట్ల గౌరవం లేకపోవడం విచారకరమన్నారు.రైతుల భూములు, ఆదివాసీల అడవులు కబ్జా చేయడం, మహిళల కృషికి గుర్తింపు లేకపోవడం వంటి సామాజిక అన్యాయాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టజీవుల నిరాశలో ఆశాకిరణంలా సోషలిజమే మార్గం. సోషలిజం వల్లనే పని హక్కుగా మారింది. తిండి, ఇల్లు, వైద్యం అందరికీ హక్కుగా లభించాయి. మహిళలు బంధనాల నుంచి విముక్తి పొందారని వివరించారు.భారతదేశంలో మాత్రం పెట్టుబడిదారీ వర్గాలు, కార్పొరేట్ సంస్థలు 'నయా ఉదారవాదం' పేరిట దోపిడీ కొనసాగిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, గనులు, అడవులు, నదులు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్తున్నాయని, హిందూత్వ రాజకీయాల పేరుతో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని గంగయ్య తీవ్రంగా విమర్శించారు.మోడీ ప్రభుత్వం అమెరికా ఆధిపత్యానికి లొంగిపోయింది. కార్మిక హక్కులు, విద్య, వైద్యం, ఇల్లు వంటి ప్రాథమిక హక్కులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎం. వసంతరావు, పి.కొండయ్య, ఎల్. జయరాజు, డి. నారపరెడ్డి, ఐవి. ప్రసాద్, జి. సుధాకర్, పి.కాలేషా, బి. సుబ్బారావు, కే. శ్రీనివాసరావు, పి. కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్. గంగయ్య

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వక్తృత్వ, క్విజ్ పోటీలలో ప్రతిభ చూపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో ఈ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బైపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని పి.దివ్య వక్తృత్వం మరియు క్విజ్ పోటీలలో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. వ్యాసరచనలో ఎంపిసి ప్రథమ సంవత్సరం విద్యార్థిని పి.ప్రసన్న మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.ఎమ్మెల్టీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం. శశాంక్ గౌడ్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. విజేతలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జుబేర్, కళాశాల ప్రిన్సిపల్ కోదండరాం, ఉపాధ్యాయులు అభినందించారు.

బాపట్ల విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి -బాపట్ల

ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి యోగా పోటీల్లో బాపట్ల ప్రొడిజి విద్యాలయం విద్యార్థి నక్కల కౌషిక్ బంగారు పతకం సాధించినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ బ్రజేష్ కానూన్గో శుక్రవారం తెలిపారు. పల్నాడు జిల్లా రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4 న నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -14 విభాగం యోగా పోటీలలో నక్కల కౌషిక్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. కౌషిక్‌కు బంగారు పతకం, మెమోంటోను యోగా గురూజీ స్వాత్మ రామస్వామి,మల్లిఖార్జున్. వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి అందచేశారు. స్వర్ణ పథకం సాధించిన కౌషిక్‌ను విద్యాలయం డైరెక్టర్లు శ్రీనివాసరావు ,చింతకాయల పార్థసారథి,పెదమల్లు ఉదయ చంద్ర రావు అభినందించారు.



శంకుస్థాపన చేస్తున్న బాపట్ల ఎంపీ,ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

గ్రామీణ రహదారులకు మహర్దశ : ఎంపీ

ప్రజాశక్తి-బాపట్ల

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టినట్లు బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. బాపట్ల మండలం గుడిపూడి నుంచి యేట్రవారిపాలెం ద్వారా కర్లపాలెం వెళ్లే రహదారి పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఎంపీ తెన్నేటి శుక్రవారం శంకుస్థాపన చేశారు. నాబార్డు నిధులతో ఈ రహదారిని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కొప్పెరపాడు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బల్లికురవ

బాపట్ల జిల్లాస్థాయిలో స్కిల్ కాంపిటీషన్ పోటీలలో కొప్పెరపాడు హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. విఎస్ఎఫ్ఐ విభాగంలో వి.కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం సాధించింది.పోటీల్లో ప్రతిభ చూపిన యం. మహిత, యం. కీర్తన, బి. విజయలక్ష్మి, సిహెచ్. కావ్య గ్రూపు బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా మెమోంటో అందుకున్నారు. ట్రేడ్ టీచర్ పార్వతి. విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అదితరులు అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- చీరాల

ఈ నెల 1 నుంచి 3 వరకూ ఏలూరు నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ అండర్-17 టైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలలో చీరాల కస్తూరిబా గాంధీ మున్సిపల్ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలలో 8వ తరగతి విద్యార్థిని షేక్ తాహిరా 48-52 కిలోల విభాగంలో బంగారు పతకం, 8వ తరగతి విద్యార్థిని ఎస్‌కె. తస్లీమా 38 కేజీల విభాగంలో వెండి పతకం సాధించిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఆలూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయలు, గ్రామస్తులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి- అద్దంకి

విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా అద్దంకి పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దామోదరం తెలిపారు. భవాని సెంటర్, పెట్రోల్ బంకు, బార్ అండ్ రెస్టారెంట్, భాగ్యనగర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.



వందేమాతరం గీతాన్ని ఆలపిస్తున్న మంత్రి ఆనం

'వందేమాతరం' భారతీయులందరికీ గర్వకారణం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వందేమాతరం గీతం భారతీయులందరికీ గర్వకారణమని రాష్ట్ర దేవాదాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఈ గీతాన్ని మొదటిసారి ఆలపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం ప్రకాశం భవనం సమీపంలోని చర్చి సెంటర్, అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు మానవహారంగా ఏర్పడి ఈ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ భారతీయులందరూ ఒకటేనని ఐక్యతను చాటుతూ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని వందేమాతరం గీతం రగిలించిందన్నారు. ఈ గీతం గొప్పదనాన్ని మరోసారి నేటి తరానికి కూడా తెలియజేసేలా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ గీతాలాపనకు పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ తరాలు మారినా వన్నెతెరగని గీతం వందేమాతరం అని తెలిపారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్రోద్యమ సమయంలో ప్రజల్లో శక్తిని నింపిందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పి డి సి సి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10న డిసిసి విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా విస్తత స్థాయి సమావేశం ఒంగోలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈనెల 10న మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా గుంటూరు మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ గౌతు సత్యేంద్ర బాబు పాల్గొంటారన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి1 పరిధిలోని 33 కెవి హాస్పిటల్ సబ్‌స్టేషన్‌లో, 33/11 కెవి సబ్ స్టేషన్ శ్రీగిరిలో మెయింటినెన్స్ చేస్తున్న కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు మున్సిపల్ ఆఫీస్, శివాలయం, సివిఎన్ రీడింగ్ రూమ్, గాంధీ రోడ్, ఏనుగు చెట్టు, మాతా శిశు వైద్యశాల, కోర్ట్ సెంటర్, సెంట్రల్ కేఫ్, రాజాపానకాల రోడ్డు, సాయిబాబా టెంపుల్ ఎదురు బజార్, శ్రీగిరి కొండమీద, లేబర్ ఆఫీస్ రోడ్డు, హరే రామ బజార్, జమ్మి చెట్టు బజార్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి.. సహకరించాలని కోరారు.

సామాజిక అణచివేతలు పోవాలంటే

సోషలిజమే ఏకైక మార్గం

సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు



పేర్నమిట్టలో జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

దేశంలోనూ, ప్రపంచంలోనూ ఆర్థిక దోపిడీ, సామాజిక అణిచివేతలు పోవాలంటే సోషలిజమే ఏకైక మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. ప్రథమ సోషలిస్టు విప్లవం రష్యాలో జయప్రదమై 108 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నవంబర్ 5 నుంచి 11 వరకు వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో శుక్రవారం సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానం అమల్లో ఉన్న అన్ని దేశాల్లో నేటికీ సంక్షోభాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సోషలిజమే అనే విషయం రుజువయిందని అన్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఒక సోషలిస్టు అభ్యర్థి మమ్దాని మేయర్గా ఎన్నిక కావడం ఒక ఉదాహరణ అని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు నాయకులు షేక్ కాలేషా, కె. రామకష్టారెడ్డి, ఎస్ కే నాగూర్‌బి, ఎస్‌కే మస్తాన్‌బి, షేక్ ఖాసిం, షేక్ ఇక్బాల్, షేక్ ఫరీదాబి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

ఒంగోలు సిటీ: అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలు 60 అడుగుల రోడ్డు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు జీ.రమేష్ మాట్లాడారు. తొలుత పార్టీ జెండాను నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.వీరాస్వామి ఆవిష్కరించారు. పార్టీ నాయకులు వి. మాలకొండయ్య, జి. భీష్మాచారి, జి. ఆదిలక్ష్మి, టి. భక్తసింగ్ రాజు, ఎం. శ్రీనివాసులు, జి. బాలకష్ణ, పాపని సుబ్బారావు, ఎం. ఆదినారాయణ, వి.కాశిం, ఎస్.కే. సుభాని, టి. వీరయ్య, డి. ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో జెండా ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

గాంధీనగర్‌లో జెండా ఆవిష్కరణ

అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో సమాజంలోని ఆకలి, అణచివేతలకు వ్యతిరేకంగా దోపిడీ లేని సమాజం నిర్మాణం కోసం కషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె. మాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలు నగరంలోని గాంధీనగర్ సెంటర్‌లో అక్టోబర్ విప్లవ దినోత్సవం సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ గావించారు. గాంధీనగర్ సిపిఎం నాయ కుడు షేక్ పీరు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్, నాయకులు సయ్యద్ హుస్సేన్, షేక్ పీరు, బి.వి.రావు, రావూరి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

- 'గ్రీన్ ఒంగోలు'ను ప్రారంభించిన ఇన్‌ఛార్జి మంత్రి ఆనం
- ఒకే రోజు 5000 మొక్కలు నాటిన వైనం



మొక్క నాటుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిరాష్ట్ర దేవాదాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆధ్వర్యంలో నగరంలో ఐదు వేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు, గిద్దలూరు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన రావు, ముత్తుమల అశోక్ రెడ్డి, బిఎన్ విజయ్ కుమార్, పి డి సి సి బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతా రామయ్య, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి ముందుగా ఒంగోలు మార్కెట్ యార్డ్ సమీపంలోని ఆచార్య ఎన్జీరంగా విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అంజయ్య రోడ్డులో కలెక్టర్ పి. రాజాబాబు, జిల్లా ఎస్పి వి.హర్షవర్ధన్ రాజు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలతో కలిసి మంత్రి ఆనం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి ఆనం మాట్లాడుతూ 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా పచ్చదనానికి, పారిశుధ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఒకేరోజు 5000 మొక్కలను నాటేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నగరంలోని ఎనిమిది ప్రధాన రహదారుల వెంట పది కళాశాలల విద్యార్థులను భాగస్వాములు చేస్తూ ఈ మొక్కలను నాటిస్తున్నట్లు తెలిపారు. వీటిని జియోట్యాగ్ చేస్తూ పర్యవేక్షణ బాధ్యతలను కూడా వారికే ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంగమూరు రోడ్ లోని రత్నదీప్ సూపర్ మార్కెట్ వద్ద ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, ఒడా ఛైర్మన్ రియాజ్ ప్రజలకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు రీజియన్ పరిధిలో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు తెలిపారు. పింఛన్ దారులు వారి లైఫ్ సర్టిఫికెట్లను జీవన్ ప్రమాణ్ యాప్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఆధార్‌తో లింక్ అయిన స్మార్ట్ ఫోన్ ద్వారా పింఛన్‌దారులు సులభంగా ఇంటి వద్ద నుంచే యాప్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

ముందస్తు పరీక్షలతో కేన్సర్ నివారణ

ఉత్సాహంగా అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముందస్తు పరీక్షల ద్వారా కేన్సర్ వ్యాధిని నివారించవచ్చని నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సిడి), ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.భగీరథిదేవి తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి రాంనగర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భగీరథిదేవి మాట్లాడుతూ గ్రామ, పట్టణాలలో ఆరోగ్యకరమైన జీవనశైలి, ముందస్తు పరీక్షల ద్వారా కేన్సర్‌ను నివారించవచ్చన్నారు. సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవనశైలి లో మార్పులు కారణంగా అసంక్రమిత వ్యాధులు, దీర్ఘ కాలిక వ్యాదులు పెరుగుతున్నాయన్నారు. బిపి, షుగర్‌తో పాటు నేడు కేన్సర్ కేసులు కూడా గణనీయంగా నమోదు అవుతున్నాయన్నారు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎన్‌సిడి 4.0 కేన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రాం లో బాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలతో ఉన్న అనుమానిత కేసులను గుర్తించాలన్నారు. గుర్తించిన వారి వివరాలను వైద్యాధికారికి తెలియజేసి అవసరమైన కేసులను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపాలన్నారు. .ప్రపంచ వ్యాప్తంగా ప్రజానీకాన్ని భయపెడుతున్న వ్యాధులలో కేన్సర్ ఒకటని, ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స ప్రారంభిస్తే త్వరగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. పురుషులలో ఊపిరితిత్తుల కేన్సర్, ఆడవాళ్ళలో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్, చిన్న పిల్లలలో లోకేమియాతో మరణాలు ఎక్కువగా సంభవిస్తాయన్నారు. గొంతు బొంగురు పోవడం, రక్తహీనత, ఎడతెగని దగ్గు, అలసటగా అనిపించడం, బరువు తగ్గడం, మహిళలలో అసాధారణ రక్త స్రావం, తెలుపు రావడం, మల మూత్ర సమయాలలో మార్పులు, రక్తం పడటం నల్లగా విరోచనం, శరీరం లోని పై భాగంలో వాపు, గడ్డలు గాని ఉండటం, మహిళల రొమ్ములలో గడ్డలు ఉండటం కేన్సర్ వ్యాధి లక్షణాలని తెలిపారు. ప్రస్తుతం కొన్ని ఆధునిక వైద్య పద్ధతులు ద్వారా కేన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చని సర్జరీలో అడ్వాన్స్ లాప్రోస్కోపిక్ సర్జరీ, రోబోటిక్ సర్జరీల ద్వారా చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గర్భ సంచి, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్, నోటి కేన్సర్, గొంతు కేన్సర్లు రేడియో థెరపి ద్వారా చికిత్స అందిస్తారన్నారు. కార్యక్రమంలో కేన్సర్ స్క్రీనింగ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్, ఎన్‌సిడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ వి.అనీల్, జిల్లా ఆరోగ్య, విస్తరణ, మీడియా అధికారి బెల్లం నరసింహారావు, ఎన్‌సిడి విభాగ డిపిఎంఒలు, హెచ్‌ఈఒలు, సిహెచ్‌ఒలు, ఆశలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, వైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం

18న ఆందోళన కార్యక్రమాలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దేశ సంపదలోనే కాకుండా చట్టసభలలో, అన్ని రంగాలలో అందరికీ వాటా దక్కేలా సామాజిక న్యాయం సాధించాలంటూ ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ధర్నాలు, సదస్సులను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సిపిఐ ప్రకాశం జిల్లా కార్యవర్గ సమావేశం కె.వి. కష్ణగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మరియు ప్రకాశం జిల్లా ఇంచార్జ్ జంగాల అజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎం.ఎల్. నారాయణ, సహాయ కార్యదర్శి ఆర్. వెంకట్రావు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చీరాల

మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న రహదారులు, చప్టాలకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. చీరాల మరియు వేటపాలెం మండలాల్లో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కలిసి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పర్యటించారు. తొలుత వేటపాలెం మండలం రామాపురం బీచ్ వద్ద కూలిపోయిన చప్టాను పరిశీలించారు. అక్కడ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వాడరేవు కొత్తపేట, పాపాయిపాలెం బీచ్, వాడరేవు కాపోలు గెస్ట్ హౌస్ వద్ద కూలిన చప్టాలను పరిశీలించారు. రామాపురం బీచ్ నుంచి వాడరేవు బీచ్ వరకు వెళ్లే రహదారి ఎనిమిది చోట్ల తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. బీచ్ ప్రాంతాల్లో గోతులు పడ్డ కారణంగా తాత్కాలికంగా పర్యాటకులను సముద్రంలోకి అనుమతించడం నిలిపివేశామని చెప్పారు. రామాపురం వద్ద కూలిన చప్టాను రూ. 6.5 లక్షలతో తాత్కాలికంగా మరమ్మతు చేయవచ్చని, భవిష్యత్తులో శాశ్వత పరిష్కారంగా రూ. 2 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కొత్తపేట గ్రామంలోని చప్టాను రూ.12 లక్షలతో తాత్కాలికంగా మరమ్మతు చేయవచ్చని, శాశ్వత పరిష్కారానికి రూ. 3.50 కోట్ల అంచనాలు రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో పి. చంద్రశేఖర్, తహశీల్దారు వంశీకృష్ణ, జలవనరుల శాఖ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.


తీరంలో పర్యటిస్తున్న కలెక్టర్ , ఎంపీ

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని రేణింగవరం ,ముప్పవరం గ్రామాల్లో సైడు కాలవల్లో పేరుకుపోయిన మురుగును శుక్రవారం తొలగించారు. సైడ్ కాలువల్లో మురుగు పేరుకు పోవడంతో ఈగలు ,దోమలు చేరి, అనేక రకాల వ్యాధులకు కారణమవుతున్నాయని, మురుగును తొలగించడం వలన దోమలు కూడా లేకుండా పోతాయని గ్రామపంచాయతీ కార్యదర్శులు సునీత, షేక్ జానీ బేగం తెలిపారు. బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మురుగు తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు. ప్రజలందరూ తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్ల ముందు ఉన్న సైడ్ కాలవలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రచారం

ప్రజాశక్తి -పంగులూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన 'వాట్సప్ గవర్నెన్స్'పై అధికారులు విస్తతంగా ప్రచారం చేస్తున్నారు. వాట్సప్ గవర్నెన్స్ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు వీధుల్లో తిరుగుతూ అవగాహన కలిగిస్తున్నారు.పంగులూరులో సచివాలయ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్ ఫోన్ లకు వాట్సాప్ ను ఓపెన్ చేయించి దాని ద్వారా ప్రభుత్వం చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజలు ఇక నుంచి ప్రతిదానికి ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ రోజుల తరబడి తిరగాల్సిన పనిలేదని, ప్రజలకు అవసరమైన సేవలు అన్ని సెల్ఫోన్ల ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ తో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగులూరు-1 సచివాలయ విఆర్ఓ చంపారావు, ఎఎన్ఎం ఎస్తేరు రాణి, మహిళా కానిస్టేబుల్ ఆర్. సంధ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

పోస్టర్ ప్రదర్శన

ప్రజాశక్తి -అద్దంకి

కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు కార్తీకమాసం సందర్భంగా ప్రకృతి సమారాధన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 రకాల మందు మొక్కలపై పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. హెర్బల్ మెడిసిన్ పేరిట విద్యార్థుల సహకారంతో కళాశాల వృక్ష శాస్త్ర విభాగం ఏకో క్లబ్ మరియు ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు సిబ్బంది, ఇతర కళాశాలల విద్యార్థులు , కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎవి.సత్యనారాయణ, డాక్టర్ షేక్ మస్తాన్ వలి, డాక్టర్ భేటీ ప్రసాద్, పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి - నగరం : బాపట్ల జిల్లా శ్రీ సత్యసాయి గ్రామ సేవావిభాగం ఆధ్వర్యంలో రేపల్లె, కర్లపాలెం శ్రీ సత్యసాయి సేవా సమితుల సహకారంతో రేపల్లె సమితి పరిధిలోని ఈదుపల్లి గ్రామంలో పశువైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 501 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 13 కిలోల మినరల్ మిశ్రం, 20 లీటర్ల లిక్విడ్ ఫీడ్ సప్లిమెంట్ పంపిణీ చేశారు. విశ్రాంత పశువైద్య నిపుణులు పున్నయ్య శాస్త్రి ఉచితంగా మందులు అందజేశారు. రైతులు మరియు గ్రామస్తులకు 100 జామ మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. డాక్టర్ హేమప్రియ , డాక్టర్ రంజితా వాడపూడి , బాపట్ల జిల్లా గ్రామ సేవా ఇన్‌ఛార్జి, మితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి-పంగులూరు : వందేమాతరం గీతం పుట్టి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల పరిధిలోని నూజిల్లపల్లి మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాల విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. విద్యాదాత పచ్చిపులుసు వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పచ్చిపులుసు వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ బకిన్ చంద్ర చటర్జీ వందేమాతరం జాతీయ గీతాన్ని 150 సంవత్సరాల క్రితం రచించినట్లు తెలిపారు. అనంతరం దాత వెంకట నాగేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంపాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు వీరాంజనేయులు, వి.ఏడుకొండలు, తదితరులు అభినందించారు.

కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి -పర్చూరు

ప్రతి ఒక్కరూ కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డి. రాజశేఖర్ తెలిపారు. ఉప్పుటూరులో కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు, వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ మానవ శరీరంలోని కణాల విభజన నియంత్రణ కోల్పోతాయో అప్పుడు కేన్సర్ వ్యాధి వస్తుందని తెలపారు. . అనంతరం పంచాయతీ సెక్రటరీ నీలం వెంకట రామకృష్ణ, పాలేరు శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది, స్కూల్ విద్యార్థినులు, గ్రామస్తులతో కలసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. బకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెరుకుపల్లి : విద్యార్థులు కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ భావన తెలిపారు. మండల పరిధిలోని కావూరు బాలికల గురుకుల పాఠశాలలో జాతీయ కేన్సర్ దినోత్సం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా జాయింట్ కలెక్టర్ భావన మాట్లాడుతూ సమాజంలో పౌరులుగా విద్యార్థులు కూడా తమ బాధ్యతలను నెరవేర్చాలన్నారు. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా ఉంచుకుంటే కొంతవరకు కేన్సర్ రాకుండా చూసుకోవచ్చని తెలిపారు..ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, తహశీల్దారు పద్మావతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపట్నం : ప్రతి ఒక్కరూ కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఉప్పుటూరు ప్రభుత్వ వైద్యులు తెలిపారు. జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని బొర్రావారిపాలెం అవగాహన కార్యక్రమవంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఎప్పుడైతే మానవ శరీరంలో కణాలు విభజన నియంత్రణ కోల్పోతాయో అప్పుడు కేన్సర్ వ్యాధి వస్తుందన్నారు. ముందుగా క్యాన్సర్ స్క్రీనింగ్, వ్యాక్సిన్స్ ద్వారా కేన్సర్ వ్యాధిని అరికట్టవచ్చునని తెలిపారు.


వేమూరులో వందేమాతరం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

వందేమాతరం భారతీయుల ఆత్మ నినాదం

ప్రజాశక్తి-బాపట్ల

వందేమాతరం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో స్వదేశీ ఉద్యమానికి తొలి చిహ్నమై ప్రతి భారతీయుడి ఆత్మ నినాదమైందని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనరాణి తెలిపారు. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ప్రోగ్రాం అధికారులు ఎం. రమాదేవి, బి.రవీంద్ర రెడ్డి, జి. విజయ్‌కుమార్ , ఎస్ఆర్.కోటేశ్వర రావు, కె. చంద్రశేఖర్, జయలలిత, శ్రీ రేఖ, ఎం. రమాదేవి , బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమూరు: వందే మాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు మాట్లాడుతూ 1875 నవంబర్ 7న బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతం మొట్టమొదటిసారిగా గీతాలాపన జరిగినట్లు తెలిపారు. వందేమాతరం గీతంలోని శబ్దం ప్రజల్లో ఆత్మవిశ్వాసం, ప్రేరణను నింపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, తహశీల్దారు సుశీల, నాయకులు జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

బల్లికురవ : మండల పరిధిలోని పల్లెకోన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (నార్త్)లో వందేమాతరం 150 ఏళ్ల వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పడమట వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేటపాలెం : మహాత్మా జ్యోతి బాపులే పాఠశాలలో వందే మాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మహ్మద్ నహీదాల్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వందేమాతరం గీతాన్ని ఆలపించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజాంపట్నం : వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంపిడిఓ నారా నాగలక్ష్మి అధ్యక్షతన బకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంగులూరు: వందేమాతరం గీత రచన జరిగి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ .స్వరూప రాణి, డిప్యూటీ ఎంపీడీవో కే. సుమంత్ ,మెడికల్ ఆఫీసర్ కే .శివ చెన్నయ్య, కార్యాలయ పరిపాలన అధికారి టి. రమేష్, అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ అధికారి రిబ్కా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచార్య రంగాకు ఘన నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

రైతులకు సమాజంలో గౌరవ మర్యాదలు పెంపొందించేందుకు తన జీవితాన్నే అంకితం చేసిన ఆచార్య ఎన్‌జి. రంగా స్ఫూర్తితో వ్యవసాయ విద్యార్థులు రైతు సంక్షేమానికి పాటుపడాలని బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డి.డి.స్మిత్ తెలిపారు. ఆచార్య ఎన్‌జి.రంగా 125వ జయంతి సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల అణచివేతపై తిరుగుబాటు చేసి, రైతు ఉద్యమానికి వినూత్న రీతిలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనదన్నారు. రైతులను రాజకీయ స్పృహ ఉన్న పౌరులుగా తీర్చిదిద్దడానికి ఆంధ్ర రైతు పాఠశాలను 1934లో తన స్వగ్రామమైన నిడుబ్రోలులో ప్రారంభించినట్లు తెలిపారు. తద్వారా రైతు తత్వశాస్త్ర ప్రతిపాదకుడుగా అన్నదాతల హృదయాల్లో శాశ్వత స్థానాన్ని రంగా సుస్థిరం చేసుకున్నారన్నారు..తొలుత రంగా చిత్ర పటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జి.రవిబాబు, కేవీఎస్.రామిరెడ్డి, బి. శ్రీనివాసుల రెడ్డి, ఎస్. విష్ణువర్ధన్, డి. విజయ్ కుమార్, బి. రాజ్ కిరణ్ , కె. కపాలి ,ఒఎస్ ఎవి.పద్మ తులసి, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన రైతు బాంధవుడు ఆచార్య ఎన్‌జి.రంగా ఆదర్శాలను నేటి యువత అలవర్చుకోవాలని బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. ఎన్‌జి.125వ జయంతి సందర్భంగా బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలో రంగా విగ్రహానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఎంపీ తెన్నేటి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్‌డిసి డిపో మేనేజర్‌కు వినతి

ప్రజాశక్తి- రేపల్లె

ఎపిఎస్ ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రేపల్లె కమిటీ గౌరవాధ్యక్షులు సిహెచ్.మణిలాల్ కోరారు. ఈ మేరకు ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విలీన సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి ఎన్‌వి.సాగర్ డిపో కమిటీ సభ్యులు జిఎస్. ప్రసాద్,వి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


డిపో మేనేజర్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

హామీలు అమలు చేయాలని చేనేతల ధర్నా

ప్రజాశక్తి - చీరాల

చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ కోరారు. హామీలు అమలు చేయాలని చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద చేనేత కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ బాపట్ల జిల్లాను తుపాను ప్రభావిత జిల్లాగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో జిల్లాలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5వేల ఆర్థిక సహాయం తక్షణం అందించాలన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, చేనేత ఉత్పత్తులపై జిఎస్‌టి రద్దు లేదా రీయింబర్స్‌మెంట్, సహకార సంఘాల్లో పనిచేస్తున్న కార్మికుల త్రిఫ్ట్ ఫండ్ బకాయిల విడుదల, ఆప్కో మరియు ప్రభుత్వ బకాయిల చెల్లింపు వంటి హామీలు ఇచ్చినట్లు తెలిపారు. అవి అమలుకు నోచలేదని తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతి చేనేత కార్మికుడికి రూ.25వేల ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించిన హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.చేతి వత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి. కొండయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన చేతి వత్తులు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎస్‌టి తగ్గింపుతో సాధారణ ప్రజలకు ఎలాంటి ఉపశమనం కలగలేదని ఎద్దేవా చేశారు. చేనేత జన సమాఖ్య నాయకుడు మునగాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆప్కో మరియు చేనేత సహకార సంఘాలు మూతపడే పరిస్థితిలో ఉన్నాయని, చేనేత కార్మికులు ఆ వ్యవస్థను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం చేనేత కార్మికుల ప్రతినిధులు ఇన్‌చార్జి ఎడిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడే గద్దె హేమసుందర్ రావు, జిల్లా కమిటీ సభ్యులు జి. మురళీకష్ణ, బి.నాగమల్లేశ్వరరావు, నాయకులు ఎస్. సూర్యనారాయణ, టి. సత్యనారాయణ, అనుభవం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -రేపల్లె

విద్యార్థి దశ నుంచే సాగు, రైతులపై గౌరవభావం పెంపొందించడం, భూసారం పట్ల ఆసక్తి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు సంచార భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి ఉయ్యూరి లోకేశ్వరి తెలిపారు. ఆత్మ వారి సౌజన్యంతో మండల పరిధిలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, వడ్డీవారిపాలెం సావిత్రి హైస్కూల్ విద్యార్థులకు మట్టినమూనాల సేకరణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాలోకేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులే స్వయంగా మట్టి నమూనాలు సేకరించి, పాఠశాలకు అందించిన కిట్ ద్వారా భూసార పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మట్టిలో ఏ లోపం ఉందో గుర్తిస్తారని తెలిపారు. భూసార పరిరక్షణపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేష్ బాబు స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, ఎంఇఒ సుమంత్ ఎంపిఇఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగురాలికి చేయూత

ప్రజాశక్తి - మార్టూరు రూరల్ : . పుట్టుకతోనే పోలియో వ్యాధితో రెండు కాళ్లు, నడుము పనిచేయక మంచానికే పరిమితమైన మార్టూరుకు చెందిన షేక్ సైదాబీకి శుక్రవారం రూ.9000 నగదు, నిత్యావసర సరుకులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్ కమిటీ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌వలి,. విశ్రాంత ఎస్‌కె.హరిబాబు, వైష్ణవి నాగేశ్వరరావు,శ్రీనివాసరావు, అయ్యప్ప స్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు

వెల్లటూరు ఉన్నత పాఠశాలో మాక్ అసెంబ్లీ

ప్రజాశక్తి- బట్టిప్రోలు

ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే మార్కెట్ అనే నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జిఎస్‌టి 2.0ను తీసుకొచ్చారని, దీన్ని మాక్ అసెంబ్లీ ద్వారా తెలియజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం కర్ర అరుణ్ కుమారి తెలిపారు. మండల పరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో శుక్రవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. గూగుల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసుకున్న ఒప్పందం వల్ల ఉద్యోగ అవకాశాలు, సాంకేతికంగా రాష్ట్రం ఏ విధంగా అభివద్ధి చెందుతుదని కళ్ల కట్టినట్లుగా మాక్ అసెంబ్లీలో విద్యార్థులు చూపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, ఉపాధ్యాయులు నక్క వెంకటేశ్వర్లు, కుటుంబరావు, ఎస్టేట్ బాబు, శివరామకష్ణ, బేబీ, పద్మ, విజయలక్ష్మి. రాణి పాల్గొన్నారు.


మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎరువుల నిల్వలు పరిశీలన

ప్రజాశక్తి - యద్దనపూడి : మండల పరిధిలోని రైతు సేవాకేంద్రాలు మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా చేపడుతున్న ఎరువుల అమ్మకాలు, నిల్వలను ఎఒ కుమారి, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ కరుణశ్రీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులు అమ్మిన వెంటనే ఈ పాస్ మెషిన్‌లో నమోదు చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, పూనూరు పిఎసిఎస్ చైర్మన్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి బోయపాటి సాంబశివరావు, పిఎసిఎస్ సెక్రెటరీ పాల్గొన్నారు.

9న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- సంతమాగులూరు : రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 9న అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంతమాగులూరు ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల వైద్యసేవలు అందిస్తారని ఆయన తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వేమూరు : వేమూరులోని టిడిపికార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వేమూరు నక్కా ఆనంద బాబు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిర్యాదులపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాని సూచించారు.ఈ కార్యక్రమంలో తహాశీల్దారు ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి -వేటపాలెం

బాపట్ల జిల్లా వయోజన విద్యా శాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సిసిలు, విఒఎలు, వాలంటీర్ల ఉల్లాస్ అక్షర ఆంధ్రపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్యా శాఖ పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్ బాబు మాట్లాడుతూ వయోజనులకు చదవడం, రాయడం నేర్పించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ పథకం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం కె.అంజిబాబు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చీరాల

సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌ను ప్రజలు వినియోగించు కోవాలని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య పాల్గొని ప్రజల నంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మొత్తం సుమారు 115 అర్జీలు స్వీకరించగా, అందులో పెన్షనుకు సంబంధించినవి 20, ఇళ్ల స్థలాలకు సంబంధించినవి 90, ఇతర సమస్యలకు సంబంధించినవి 5 అర్జీలు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో టిడిపి చీరాల నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్,ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మున్సిపల్ చైర్మన్ మించాలా సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షుడు గంజి పురుషోత్తం, నాగేశ్వరరావు తేలప్రోలు, మొహిద్దిన్, శివ నాగమల్లేశ్వరి, బోయిన శివ, జంగిలి రాముడు, కారంపూడి పద్మిని మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సహాయనిధి చెక్కులు అందజేత

నిరుపేదలకు సిఎం సహాయనిది వరం లాంటిది అని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. సిఎం సహాయనిధి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. 80 మంది లబ్ధిదారులకు రూ.48,12,835 విలువైన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలతో సమావేశం

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఇంకొల్లులోని కామాక్షి లాడ్జిలో వైసిపి పట్టణ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పర్చూరు నియోజక వర్గ సమన్వయకర్త, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి కార్యకర్తలు ఏకతాటిపై వచ్చి పార్టీ బలోపేతానికి కషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎలాంటి సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ పటిష్టం కోసం వైసిపి కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు ఐక్యం కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు చిన్ని పూర్ణచంద్రరావు, జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకర్ రావు, డాక్టర్ వింగ్స్ అధ్యక్షుడు షేక్ ఇమ్రాన్ ఆలీ, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఆయూష్ బుడ, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు, కుమ్మరి చందు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు పల్లె పోగు ప్రసాద్, సునీల్, గుంటూరు శ్రీను, సత్యనారాయణ, షేక్ మస్తాన్, అమ్మిశెట్టి శ్రీను, పోపూరి మోహన్‌రావు, బండారు పసంగి ,జెట్టి శంకర్‌శెట్టి , కరి చలమయ్య, బాబు, ఇస్రాయిల్, సంసుద్దీన్, కరి వాసు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ 'ఓనర్స్' సమావేశం

ప్రజాశక్తి-అద్దంకి

స్థానిక అభ్యుదయ నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో గెల్లా ఆనంద్ బాబు అధ్యక్షతన సెంట్రింగ్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు మాట్లాడుతూ అద్దంకి పట్టణ మరియు పరిసర గ్రామాల్లోని సెంట్రింగ్ ఓనర్స్ అద్దంకి సెంట్రింగ్ ఓనర్స్ అసోసియేషన్ యూనియన్‌లో సభ్యులుగా చేరాలన్నారు. యూనియన్ నిర్ణయాలను అమలు కోసం తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఒకరు చేసే పనికి మరొకరు వెళ్లకూదని తీర్మానించారు. అల్లా వెళ్లితే యూనియన్ తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు. గహాలకు సెంట్రింగ్ సామగ్రి అమర్చే విషయాల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహాల యజమాన్యంతో ముందుగా బాండ్ రూపంలో ఒప్పందాలు చేసుకోవాలన్నారు. అలా చేస్తే ఒప్పందాలు ఉల్లంఘనలు జరగకుండా ఉంటాయన్నారు. సెంట్రింగ్ ఓనర్స్‌కి ఆర్థిక విషయాల్లో గృం యజమానులు ఏమైనా అటంకాలు కలుగజేస్తే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం యూనియన్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెక్రటరీ గర్నెపూడి ఎర్ర వెంకయ్య. జాయింట్ సెక్రెటరీ దాసరి అబ్రహం. వైస్ ప్రెసిడెంట్ దుద్దుకూరి చంద్ర శ్రీను, ట్రెజరర్ మున్నంగి మరియ దాసు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ధర్మవరపు భాస్కరరావు. ఎద్దు వేణు, దాసరి లక్ష్మణరావు. ఈర్ల బాలకోటేశ్వరరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి : డిఇఒ

ప్రజాశక్తి -బాపట్ల

క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి వారిలో క్రీడా సామర్థ్యాన్ని వెలికి తీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ .పురుషోత్తం తెలిపారు. బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-17 బాల బాలికల హాకీ జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు క్రీడలు పట్ల ఆసక్తి ఉందన్నారు. వారిని ప్రతిభను గుర్తించి వారు ఎంపిక చేసుకున్న క్రీడల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయదు బి..వీరచంద్ర, ఇంటర్నేషనల్ హాకీ రాష్ట్ర కార్యదర్శి జి.హర్షవర్ధన్,. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివి. కష్ణారావు , డిఎస్‌సి హాకీ కోచ్ వెంకట్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా కనిగిరి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గహంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సంక్షేమాధికారిని శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సస్పెండ్ చేశారు. విద్యార్థినులను సెలవుల సమయంలో తల్లిదండ్రుల సమక్షంలోనే ఇంటికి పంపాలన్న ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ.. కనిగిరి కళాశాల వసతి గహ సంక్షేమాధికారి కె. చంద్రకుమారి విద్యార్థినులను ఒంటరిగా పంపినట్లు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా బోర్డర్స్ మూమెంట్ రిజిస్టర్ నమోదు చేయకపోవడం, మెనూ సక్రమంగా అమలు చేయకపోవడం, విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చూపడం వంటి అంశాలు కూడా ఫిర్యాదుల్లో ప్రస్తావించబడ్డాయి. విద్యార్థినులు ఈ విషయాన్ని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ యం.ఉగ్రనరసింహారెడ్డి దష్టికి తీసుకెళ్లగా ఆయన జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ (సాంఘిక సంక్షేమ శాఖ) లక్ష్మానాయక్, సహాయ సాంఘిక సంక్షేమాధికారి పి.శివనాయక్ విచారణ జరిపి నివేదిక సమర్పించారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

సిబ్బంది సంక్షేమానికి ఎల్లవేళలా కృషి

ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రమేష్ హాస్పిటల్ బందం సహకారంతో శుక్రవారం బాపట్ల పట్టణంలోని ఎం.ఎస్.ఆర్. కళ్యాణ మండపంలో పోలీస్ సిబ్బంది వారి కుటుంబసభ్యుల ఆరోగ్య సమస్యలను పరీక్షించడానికి ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం స్వయంగా వైద్య పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించి సిబ్బంది ఆరోగ్యపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులు సుమారు 200 మంది ఈ మెగా వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది వారి కార్యనిర్వహణలో భాగంగా 24/7 అప్రమత్తంగా విధులు నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 365 రోజులు పాటు అప్రమత్తంగా విధులు నిర్వహించే క్రమంలో పోలీస్ సిబ్బంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారని చెప్పారు. దానివల్ల వారి జీవితంలో అనేక ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ముఖ్యంగా తక్కువ వయసులోనే డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి పలు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. కరోనా మహమ్మారి వచ్చిన తర్వాత దాని ప్రభావం వల్ల చాలామందిలో అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే వారు సమాజంలో ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించి, శాంతి భద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తూ విధులు నిర్వహించగలరన్నారు. ఇటీవల పోలీస్ సిబ్బందికి నిర్వహించిన వైద్య పరీక్షల్లో కొంతమంది సిబ్బందికి కార్డియాలజీకి సంబంధించిన సమస్యలను గుర్తించడం జరిగిందని చెప్పారు. మెరుగైన చికిత్స అవసరమైన వారికి ఆరోగ్యభద్రత ద్వారా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్‌బి ఇన్స్పెక్టర్ జి. నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ. మౌలుద్దీన్, స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ కిరీటి, మధుప్రియ, రోషన్ లు, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా డిఆర్‌సి

- ఐదారు శాఖలకే పరిమితమైన సమీక్ష
- ఒకే రోజు పలు కార్యక్రమాలతో హడావుడి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మొంథా తుపాను తర్వాత జరిగిన కీలక డిఆర్‌సీ మొక్కుబడిగానే సాగింది. పలు శాఖలపై కూలంకుషంగా చర్చ సాగలేదు. డిఆర్‌సి ప్రాధాన్యతను ప్రజాప్రతినిధులు అంతగా గుర్తించలేదు. సాదాసీదా సమావేశంలాగే భావించారు. ఒకే రోజున పలు కార్యక్రమాలు పెట్టారు. సమయం లేదు. హడావుడే తప్ప సమస్యలపై దృష్టి సారించే పరిస్థితి కనిపించలేదు. ఒకే రోజున పలు కార్యక్రమాలు పెట్టారు. అధికారులు కూడా ఆలోచించలేదు. సమన్వయం లోపించింది. డిఆర్‌సి రోజున ఇతర ముఖ్యమైన కార్యక్రమాలు ఏవీ పెట్టకూడదు. ఇదే రోజున వెలిగొండ ప్రాజెక్టుకు ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా వచ్చారు. సొరంగాలను పరిశీలించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, వైపాలెం ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. ఇక్కడ సమావేశం రోజునే వెలిగొండకు ఇరిగేషన్ మంత్రి రావడం సమన్వయ లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఎవరిదారి వారిదన్నట్లుగానే కనిపిస్తోంది. ఇక ఒంగోలు నగరంలో 5 వేల మొక్కలు నాటే కార్యక్రమం కూడా ఇదే సమయంలో పెట్టారు. ఉదయం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 12 గంటల వరకూ ఈ కార్యక్రమాలతో సరిపోయింది. 12 గంటల తర్వాత గానీ డిఆర్‌సీ మొదలుకాలేదు. అప్పటి నుంచి 3 గంటల వరకూ నడిపారు. వ్యవసాయశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదలశాఖ, మత్స్య శాఖ, నేషనల్ హైవే తదితర శాఖలకే సమీక్ష పరిమితమైంది. ఎమ్మెల్యేలు కూడా నియోజకవర్గాల్లో వర్షాలకు జరిగిన నష్టాలను వివరించారు. జాతీయ రహదారులపై వరదనీరు ప్రవహించడం, ముంపు సమస్యలు, నష్టాలు వంటివి మొక్కుబడిగా వివరించారు. ఇతర అంశాలపై చర్చించే అవకాశం కూడా లేకుండా పోయింది. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపైనా చర్చ కనిపించలేదు. అనంతరం ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ సమావేశంలో భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాలను ఎమ్మెల్యేలు వివరించారన్నారు. అందరూ సకాలంలో స్పందించి పనిచేశారని వెల్లడించారు. ప్రజలకు నష్టం కలుగకుండా చూశారన్నారు. జాతీయ రహదారులపై వరదనీరు పొంగడం వంటివి ప్రస్తావించారన్నారు. అధికారులను శాఖల వారీగా నివేదికలు తయారు చేసి పంపాలని సూచించామన్నారు. వచ్చే డిఆర్‌సీలోపు ఆయా సమస్యలను పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవడం జరుగుతుందని చెప్పారు. అన్ని అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

- నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు
- దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించాలి
- అమృత్ 2.0 పూర్తి చేసేలా చూడండి
- ఇన్‌ఛార్జి మంత్రిని కోరిన ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా సమీక్ష మండలి(డిఆర్‌సి)లో సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. మొంథా తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని పలువురు ఎమ్మెల్యేలు ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడాలని, అమృత్ 2.0 పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. స్పందించిన ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు



జిల్లాలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. జల జీవన్ మిషన్‌లో జిల్లాకు 2140 కోట్లు నిధులు మంజూ రయ్యాయని, సంబంధిత పనులు చేపట్టి త్వరగా పూర్తీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపి నిధులతో చేపట్టిన ఆర్‌ఒ ప్లాంట్స్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

అమృత్ 2.0 పూర్తి చేసేలా చర్యలు



ఒంగోలు నగర ప్రజలకు సురక్షిత తాగు నీటి సరఫరాతో పాటు అమత్ పథకం 2.0 కింద చేపట్టిన పనులు సత్వరం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఇన్‌ఛార్జి మంత్రిని కోరారు. 2014-19 లో గుండ్లకమ్మ నుండి తాగునీటి పైప్ లైను పనులు చేపట్టారని, అందులో 85 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు.

ట్యాంకర్ల బిల్లులు చెల్లించాలి



2014లో నియోజకవర్గంలో 3 గ్రామ పంచాయతీల్లో ప్రజల తాగునీటి అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని రవాణ చేశారని, వాటి బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఇన్‌చార్జి మంత్రిని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు కంభం చెరువు కిద అరటి పంట దెబ్బతిందని, రైతులను ఆదుకోవాలని కోరారు. నల్లమల అటవీ ప్రాంతంలో పంట పొలాలకు అడవి పందుల బెడద ఉందని, సబ్సిడీతో సోలార్ ఫెన్సింగ్ యూనిట్లు మంజూరు చేయాలని కోరారు.

పోలీస్‌స్టేషన్లకు కొత్త భవనాలు మంజూరు



శిథిలావస్థలో ఉన్న పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలు మంజూరుచేయాలని ఎపి మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. టంగుటూరు పోలీసు స్టేషన్ భవనం శిథిలావస్థలో ఉందని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సింగరాయకొండ పోలీస్ స్టేషన్ నీట మునిగిందన్నారు. . ఈ రెండు పోలీసు స్టేషన్లకు కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరారు. తాగునీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయని, వీటి పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు.

రహదారుల పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారులు దెబ్బతిన్నాయని, వాటి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పర్యాటకాభివద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ కోరారు. గ్రామాలలో ఓఎండి పనులు సక్రమంగా జరగలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై విచారణ జరపాలన్నారు.

జెజెఎంకు నిధులు మంజూరు కావట్లేదు

జల్ జీవన్ మిషన్‌లో జిల్లాకు నిధులు మంజూరు కావడం లేదని, ఎన్ని నిధులు ఇచ్చారో చెప్పాలని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తుపాన్‌తో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి కోరారు. పొలాలకు వెళ్ళే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి మంత్రిని కోరారు.

దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలి



తుఫాన్ కారణంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు నుండి నీటిని వదలడంతో చాలా గ్రామాల్లో రోడ్లు, పంట పొలాలు నీట మునిగాయని, వ్యవసాయ రోడ్లు బాగా దెబ్బ తిన్నాయని, వాటిని పునరుద్ధరించాలని ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు నల్లబర్లీ తడిచిపోయిందని, రైతులను ఆదుకోవాలని ఇన్‌చార్జి మంత్రిని కోరారు.

'రక్షిత' పథకాలు పూర్తి చేయాలి



నియోజకవర్గ పరిధిలో చేపట్టిన రక్షిత మంచి నీటి పథకాలను త్వరగా పూర్తి చేయాలని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. నియోజక వర్గ పరిధిలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని ఆయన ఇన్‌చార్జి మంత్రిని కోరారు.

పాలుట్ల రోడ్డును పునరుద్ధరించాలి



తుపాన్ కారణంగా పాలుట్లకు వెళ్ళే రహదారి దెబ్బతిందని, పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని యర్రగొండపాలెం శాసన సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గదుల కేటాయింపునకు వైద్యులు రూ.వెయ్యి తీసుకుంటున్నారని ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు చేశారు. జల జీవన్ మిషన్‌లో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.